ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
సోమవారం 12 ఫిబ్రవరి 2024



అరాచకంపై శంఖారావం

● ఇచ్ఛాపురం నుంచి యాత్ర ప్రారంభం ● యువనేతకు ప్రతిచోటా ఘన స్వాగతం

● వైసీపీపై విరుచుకుపడిన నారా లోకేశ్

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' యాత్రకు ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి అపూర్వ స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఆదివారం ఉదయం యాత్ర ప్రారంభించారు. వైసీపీ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ.. లోకేశ్ ప్రసంగం ఆద్యంతం ఆకట్టుకుంది. సీఎం జగన్ తీరుతో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారంటూ వైసీపీ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. రానున్నది టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వమేనని స్పష్టం చేస్తూ.. ప్రజలకు భరోసా ఇచ్చారు. తన పర్యటనతో పార్టీ శ్రేణుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు.

(శ్రీకాకుళం, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలన.. వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'శంఖారావం' పూరించారు. ఆదివారం ఇచ్ఛాపురం వేదికగా ఈ యాత్ర ప్రారంభించి.. పలాస, టెక్కలి నియోజకవర్గాల్లోనూ సభలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ పాలన, మంత్రుల తీరుపై ధ్వజమెత్తారు. 'పలాసలో మంత్రి అప్పలరాజు.. కొండలను మింగే అనకొండ. అడ్డంగా కొండలకు కొండలను తవ్వేస్తూ దోచుకుంటున్నాడు. ఆయన పేరుకే డాక్టర్. కానీ వాస్తవానికి మంచి యాక్టర్. అహంకారానికి మానవరూపం. ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయరు. కనీసం రోడ్డు కూడా వేయరు. సొంతపార్టీ శ్రేణులనే వేధిస్తున్న ఆయనకు ప్రజలు ఓ లెక్కా?' అంటూ మంత్రి తీరుపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మండిపడ్డారు. 'రెండు నెలలు ఓపిక పట్టు బ్రదర్. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే. మొత్తం విచారణ చేపట్టి.. వడ్డీతో సహా కక్కిస్తాం' అంటూ మంత్రిని ఉద్దేశించి హెచ్చరించారు. 'మంత్రి కూడా పేదవాడు అంటున్నాడు. మరి రూ.12కోట్ల విలువైన లాడ్జి ఎలా కొన్నాడో ప్రజలకు చెప్పాలని ఈ సభాముఖంగా అడుగుతున్నాను'న్నారు. బర్రెల కొనుగోళ్లలో రూ.2వేల కోట్లు ప్రజా ధనాన్ని లూటీ చేశారని దుయ్యబట్టారు.

వలసలు లేని ఉత్తరాంధ్ర

'శ్రీకాకుళం జిల్లాకు పాదయాత్రలో జగన్మోహనరెడ్డి ఇచ్చిన 60 హామీల సంగతేంటి' అని సీఎంను లోకేశ్ ప్రశ్నించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలసలు లేని ఉత్తరాంధ్రగా మార్చుచేస్తామని చెప్పారు. ప్రత్యేక సెజ్‌ను ఏర్పాటుచేసి యవతకు ఉద్యోగాలిచ్చాకనే మళ్లీ ఓట్లు అడుగుతామని చెప్పారు. జిల్లాకు ఇచ్చిన 60 హామీల్లో ఒక్కటైనా ఎందుకు పూర్తి చేయలేదో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టును పూర్తిచేయలేదని, వంశధార, తోటపల్లి కుడి, ఎడమ కాల్వలు పూర్తి చేస్తామని చెప్పి మోసగించారని విమర్శించారు. పశుసంవర్ధక మంత్రి అప్పల రాజు అన్నింటిలో దోపిడీకి పాల్పడు తున్నారని.. నియోజకవర్గంలో ఏ కొండనూ విడిచిపెట్టడంలేదని వివరించారు. రెండు నెలులు ఆగితే మంత్రి అవినీతిపై విచారణ చేపట్టి అక్రమ ఆస్తులను ప్రభుత్వానికి అప్పగిస్తామని చెప్పారు.

పథకాలు అమలుచేస్తాం..

నిరుద్యోగులకు ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని.. ఉద్యోగం వచ్చేదాకా నెలకు రూ. 3వేలు భృతి ఇస్తామని ప్రక టించారు. రైతులకు రూ. 20వేలు పెట్టుబడి సాయంగా ఇస్తామని.. ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పారు. 18-59 ఏళ్ల వయసున్న మహిళలకు నెలకు రూ. 1500 చొప్పున ఇస్తామని.. ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసేలా అవకాశం కల్పిస్తామని చెప్పారు.

నదుల అనుసంధానం చేస్తాం..

నాగావళి-వంశధార నదుల అనుసంధాన ప్రక్రియను ప్రకటించింది టీడీపీ ప్రభుత్వమే అని.. కిడ్నీ బాధితులకు డయాలిసెస్ కేంద్రంతోపాటు, పెన్షన్ కూడా మంజూరు చేశామని చెప్పారు. తితలీ తుపానులో, హుద్‌హుద్ సమయంలో కూడా త్వరితగతిన పరిహారం అందజేశామన్నారు. అనంతరం నియోజకవర్గ నాయకులతో, ప్రజల మధ్యన, కార్యకర్తలు, సభకు వచ్చిన జనంతో ప్రతిజ్ఞ చేయించారు. టీడీపీ- జనసేన అధికారంలోకి వస్తే చేపట్టబోయే పనులను గురించి.. అలాగే ఏవిధంగా అభివృద్ధి చేస్తామన్నది వివరించారు.



శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, టెక్కలి సభలకు హాజరైన టీడీపీ శ్రేణులు, ప్రజలు

రేపటి నుంచి 'మన్యం'లో

● జిల్లాకు తొలిసారిగా రానున్న నారా లోకేశ్

● సభల విజయవంతానికి టీడీపీ శ్రేణుల కసరత్తు

పార్వతీపురం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేపట్టనున్న 'శంఖారావం' యాత్రకు సర్వం సన్నద్ధమైంది. జిల్లాలో మంగళవారం నుంచి ఆయన పర్యటించనున్నారు. 13న పాలకొండ, కురుపాం, 14న పార్వతీపురం, సాలూరు నియోజకవర్గాల్లో లోకేశ్ శంఖారావం సభలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా పార్టీ శ్రేణులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాయి. సభల విజయవంతానికి కసరత్తు చేస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో లోకేశ్ పర్యటనకు ప్రజల నుంచి భారీ స్పందన రావడంతో జిల్లాలో టీడీపీ కార్యకర్తలు, నేతలు మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతున్నారు. మన్యంలోనూ శంఖారావం కార్యక్రమాన్ని భారీగా నిర్వహించేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. జిల్లా ఏర్పాటైన తర్వాత తొలిసారిగా లోకేశ్ వస్తుండడంతో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

పర్యటన ఇలా..

నారా లోకేశ్ మంగళవారం మధ్యాహ్నం రెండు గంటలకు పాలకొండకు చేరుకుని శంఖారావం కార్యక్రమం ప్రారంభించనున్నారు. అనంతరం కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఎర్రనగుడి వద్ద సభ నిర్వహించనున్నారు. ఆ రాత్రి పార్వతీపుర చేరుకుని బస చేస్తారు. బుధవారం ఉదయం పార్వతీపురంలో శంఖారావం సభను నిర్వహించనున్నారు. ఆ తర్వాత సాలూరు చేరుకోనున్నారు. కాగా అంతకు ముందు ఆయన టీడీపీ ముఖ్య నేతలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్యకర్తలు, నాయకులతో చర్చించనున్నట్లు తెలిసింది.



పాలకొండలో సభాస్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

సభా స్థలం పరిశీలన

పాలకొండ: పట్టణంలో శంఖారావం సభ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు ఆదివారం పాలకొండ- వీరఘట్టం ప్రధాన రహదారిలో ఏఎంసీ మార్కెట్ యార్డు సమీపంలోని సభ స్థలాన్ని టీడీపీ నేతలు పరిశీలించారు. పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ, అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కె.శ్రావణ్ కుమార్ తదితరులు ఏర్పాట్లపై శ్రేణులకు తగు సూచనలు, సలహాలు అందించారు. శంఖారావం సభకు ప్రతిఒక్కరూ తరలివచ్చి, విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. టీడీపీ నేతలు అప్పలనాయుడు, కోటేశ్వరరావు, కాశింనాయుడు, కన్నబాబు, గౌరునాయుడు, శంకరరావు, భాస్కరరావు తదితరులున్నారు.

6 నెలలు అవుతున్నా..

● సీతంపేట ఆసుపత్రిలో వినియోగంలోకి రాని బ్లడ్ బ్యాంకు

● ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేదెప్పుడు? ● రక్తం నిల్వలు ఉంచేదెప్పుడు?

● రోగులకు తప్పని అవస్థలు ● అత్యవసర వేళల్లో తప్పని పరుగులు

సీతంపేట: సీతంపేట ఏరియా ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంకు ఏర్పాటు చేసినప్పటికీ.. దాని సేవలు మాత్రం అందుబాటులోకి రావడం లేదు. అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్ బిగించకపోవడంతో ఇక్కడ రక్తం నిల్వలు ఉంచలేకపోతున్నారు. సుమారు ఆరేడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా.. పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో అత్యవసర వేళల్లో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. సమీపంలో మరెక్కడా బ్లడ్ బ్యాంకు లేకపోవడంతో రక్తం కోసం వారు పరుగులు పెట్టాల్సి వస్తోంది. వాస్తవంగా సీతంపేట సీహెచ్‌సీని గత టీడీపీ ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. అదనపు భవనాల నిర్మాణం, ఫర్నీచర్, పరికరాల ఏర్పాటు కోసం సుమారు రూ.20 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పనులు చేపట్టగా.. సెకండ్ ఫ్లోర్‌లో ఆపరేషన్ థియేటర్, వైద్యుల గదులు ఏర్పాటు చేశారు. వీటితోపాటు రోగులకు అవసరమైన వార్డులను కూడా నిర్మించారు. అదే భవనంలో 240 యూనిట్ల రక్తం నిల్వ చేసేందుకు వీలుగా పరికరాలతో బ్లడ్ బ్యాంక్‌ను ఏర్పాటు చేశారు. అయితే అవన్నీ అందుబాటులోకి తీసుకురావాలంటే విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. దీని కోసం ఆరు నెలల కిందట ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు విద్యుత్‌శాఖకు నిధులు సైతం చెల్లించారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను టెక్కలి నుంచి తీసుకురావాల్సి ఉంది. అయితే సంబంధిత కాంట్రాక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ తీసుకురావడంలో జాప్యం చేస్తుండడంతో బ్లడ్ బ్యాంక్ వినియోగంలోకి రావడం లేదు. ఆసుపత్రి నుంచి దీనికి కరెంట్ సరఫరా అవుతున్నప్పటికీ.. బ్లడ్ బ్యాంక్ నిర్వహణకు అది ఏ మాత్రం చాలడం లేదు. కాగా ప్రస్తుతం సీతంపేటకు ఏరియా ఆసుపత్రికి సీతంపేటతో పాటు భామిని, వీరఘట్టం, శ్రీకాకుళం జిల్లా కొత్తూరు, హిరమండలం నుంచి భారీగా గిరిజనులు వస్తుంటారు. అయితే రోడ్డు ప్రమాదాలకు గురైన వారు, గర్భిణులు ఆసుపత్రికి చేరే సమయంలో, శస్త్రచికిత్సలు చేసే వారికి రక్తం అవసరమైతే రోగుల కుటుంబ సభ్యులు పాలకొండ, శ్రీకాకుళానికి తరలివెళ్లాల్సి వస్తోంది.



ట్రాన్స్‌ఫార్మర్ కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ దిమ్మ



సీతంపేట ఆసుపత్రి బ్లండ్ బ్యాంకులో నిరుపయోగంగా ఉన్న సామగ్రి

కాల్ సెంటర్ ఏదీ?

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో కాల్ సెంటర్ నిర్వహించేవారు. దీని ద్వారా చుట్టు పక్కల ఆసుపత్రుల్లో ఎన్ని యూనిట్ల బ్లడ్, ఏయే గ్రూపులు అందుబాటులో ఉన్నాయో తెలిసేంది. దీంతో రోగులకు ఇబ్బంది ఉండేది కాదు. అత్యవసర సమయంలో ఆసుపత్రి సిబ్బంది ఇతర ప్రాంతాల నుంచి బ్లడ్ తెప్పించేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సేవలకు మంగళం పాడేశారు. దీంతో సీతంపేట ఐటీడీఏ పరిధిలో గిరిజనులు శ్రీకాకుళం, పాలకొండ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్తున్నా.. సకాలంలో వారికి రక్తం అందడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావును వివరణ కోరగా బ్లడ్ బ్యాంకుకు అవసరమైన విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల రక్త నిల్వలు ఉంచడానికి వీలు లేకుండా పోయిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు విషయాన్ని సంబంధిత కాంట్రాక్టర్ దృష్టిలో పెట్టామని చెప్పారు.

శుభకార్యాలకు వేళాయే..

● మంచి ముహూర్తాలు వచ్చేశాయ్..

● వివాహాలు, గృహప్రవేశాల ఏర్పాట్లలో జిల్లావాసులు

● అంతటా సందడే సందడి



సాలూరు రూరల్, ఫిబ్రవరి 11: శుభ కార్యాలకు వేళయ్యింది. మంచి ముహూర్తాలు వచ్చేశాయి. మాఘమాసం రావడంతో జిల్లాలో పెళ్లిబాజాలు మోగాయి. వాస్తవంగా గత నెల 10 వరకు మార్గశిరమాసం కావడంతో వివాహాలు జోరుగా సాగాయి. అనంతరం పుష్యమాసం కావడంతో శుభకార్యాలకు బ్రేక్ పడింది. ఇప్పుడు మాఘమాసం రాగా ఏప్రిల్ 26 వరకు శుభ ముహు ర్తాలున్నాయి. దీంతో ఉమ్మడి జిల్లాలో వేలాది పెళ్లిళ్ల జరగనున్నాయి. ఏప్రిల్ 28 నుంచి జూలై 8 వరకు గురు,శుక్ర మూఢాలు ఉన్నాయి. ఆ తర్వాత ఆషాఢం, శూన్యమాసం కావడంతో పెళ్లిళ్ల తదితర శుభ కార్యక్రమాలను నిర్వహించలేని పరిస్థితి. వివాహాది శుభకార్యాలకు మళ్లీ శ్రావణమాసం వరకు ఆగాల్సిందే. అందుకే ఈ శుభ సమయాల్లోనే వివాహాది కార్యక్రమాలను నిర్వహించడానికి జిల్లావాసులు ఆసక్తి చూపుతున్నారు.

ఇవీ ముహూర్తాలు

ఈ నెలలో 13, 14, 17 ,18, 24, 28 ,29 తేదీల్లో శుభముహూర్తాలున్నాయి. వచ్చే నెలలో 2, 3, 15, 16, 17, 20, 22, 24, 25, 27, 28, 30 తేదీల్లో, ఏప్రిల్‌లో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీల్లో మంచి ముహూర్తాలున్నాయి. అంతేకాక ఈ మూడు నెలల్లో వధూవరుల నక్షత్ర, జాతకాలు బట్టి శుభ ముహూర్తాన్ని వీలైన తేదీని జ్యోతిష్యులు నిర్ణయించే అవకాశముంది. ఈ కాలంలో పెళ్లిళ్లతో పాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, ఉపనయనాలు నిర్వహించుకోవచ్చు. ఇదిలా ఉండగా శుభకార్యాల కారణంతో మార్కెట్లన్నీ కళకళలాడుతున్నాయి. వస్త్ర, బంగారు ఆభరణాల షాపులు రద్దీగా మారాయి. ఇప్పటికే కల్యాణ మండపాలన్నీ బుక్ అయిపోయాయి. మరోవైపు మంగళవాయిద్యాలు, డెకరేషన్, పూలు, కేటరింగ్, వంట పనివారు, వీడియో, ఫొటోగ్రాఫర్లు, పురోహితులకు డిమాండ్ ఏర్పడింది. అయితే అన్నింటి ధరలు అమాంతం పెరిగినా.. తప్పనిసరి పరిస్థితుల్లో ఖర్చుకు వెనుకాడకుండా జిల్లావాసులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఏప్రిల్ 26 వరకు చేసుకోవచ్చు..

ఈనెల 13 నుంచి శుభ ముహూర్తాలు ఉన్నాయి. శుభ కార్యాలు, వివాహాలు, గృహప్రవేశాలకు అనుకూలం. వధువరుల నక్షత్రాలు, జాతకాల ప్రకారం కూడా శుభ ఘడియలు ఉంటాయి. ఈ ఏడాది ఏప్రిల్ 26 వరకు శుభకార్యాలు చేసుకోవచ్చు.

- జి.తిరుపతినాయుడు, జ్యోతిషుడు, సాలూరు

అప్రంటీస్ విధానం రద్దు చేయాలి

● యూటీఎఫ్ డిమాండ్

బెలగాం, ఫిబ్రవరి 11 : ఉపాధ్యాయ నియామకాల్లో అప్రంటీస్ విధానం రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా నేత ఎస్.మురళీమోహన్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ నిర్ణయాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోకి ఆ విధానాన్ని తీసుకురావడమంటే, టీచర్లను వెట్టిచాకిరిలోకి నెట్టడమే అని పేర్కొన్నారు. సీఎం , ఎమ్మెల్యేలకు కూడా అప్రంటీస్ విధానం పెడతారా? అని ఆయన ప్రశ్నించారు. రెండేళ్లు అప్రంటీస్ చేసిన తర్వాత పరిపాలన బాగుంటే కొనసాగించడం.. లేదంటే రీకాల్ చేస్తే బాగుంటుందన్నారు. విద్యాహక్కు ప్రకారం ఉపాధ్యాయ నియామకాలు రెగ్యులర్ వేతనంతో కూడినవిగా ఉండాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించి నియామకాలు చేపడతామనడం నియంతృత్వ పోకడకు అద్దం పడుతుందని స్పష్టం చేశారు. ఈ విధానం రద్దు చేయాలని, లేకుంటే ఉపాధ్యాయులు ఉద్యమాలకు సిద్ధమవుతారని ఆయన తెలిపారు.

ప్రశ్నిస్తున్నా.. పట్టించుకోరా?

● సాలూరులో పారిశుధ్య లోపం

● ఎక్కడికక్కడే పేరుకుపోయిన చెత్తకుప్పలు

● పూడికలతో నిండిన కాలువలు

● అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు నిలదీస్తున్నా స్పందించని మున్సిపల్ అధికారులు

● ఫాగింగ్, మలాథియన్ స్ప్రేయింగ్ చర్యలు శూన్యం

● ఇబ్బందుల్లో పట్టణ ప్రజలు

సాలూరు, ఫిబ్రవరి11: సాలూరులో పారిశుధ్యం క్షీణించింది. ఎక్కడికక్కడే చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. కాలువలు పూడికలతో నిండాయి. రోడ్లపైనే మురుగునీరు దర్శనమిస్తోంది. దీంతో దోమలు, ఈగలు విజృంభిస్తున్నాయి. ప్రధానంగా దోమల బెడద ఎక్కువగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తరచూ రోగాల బారిన పడుతున్నారు. పరిస్థితి ఇంత దారుణంగా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. దీనిపై మున్సిపల్ సర్వసభ్య సమా వేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిల్ సభ్యులు ప్రశ్నించినా.. కనీస చర్యల్లేవు. దీంతో మున్సిపల్ యంత్రాంగం తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి..

సాలూరులో 29వరకు వార్డులు ఉన్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 50 వేలకు పైగానే జనాభా ఉంది. అయితే పట్టణంలో అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో పారిశుధ్య పను లు జరగడం లేదు. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. కుండీలు నిండి రోడ్లపైకి చెత్తాచెదారం వచ్చినా పట్టించుకునే వారే కరువ య్యారు. పట్టణంలో ఇంటింటికీ వెళ్లి సక్రమంగా చెత్త సేకరణ కూడా చేయడం లేదు. కాలువల్లో పూడికలను సైతం తొలగించడం లేదు. దీంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. సాయంత్ర మైతే చాలు పట్టణవాసులు వణికిపోతున్నారు. దోమల బెడదను తట్టుకోలేకపోతున్నారు. అయితే వాటి నియంత్రణకు మున్సిపల్ అధికారులు కనీస చర్యలు తీసుకోవడం లేదు. ఫాగింగ్, మలాథియన్ స్ప్రేయింగ్ వంటివి చేయడం లేదు. ఒక్కోసారి ప్రధాన రహదారికి ఇరువైపులా స్ప్రేయింగ్ చేసి మమ అనిపిస్తున్నారు. మరోవైపు పొరుగున ఉన్న బొబ్బిలి మున్సిపాల్టీ కంటే అదనంగా చెత్త పన్ను వసూలు చేయాలని తీర్మానించారు. ఇంకా అది అమలులోకి రాకపోయి నప్పటికీ పట్టణంలో పారిశుధ్యం మెరుగుపర్చకుండా ఇటువంటి నిర్ణయాలు తీసుకోవడం ఏమిటనే వాదనలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీనిని పట్టణవాసులు కూడా తీవ్రం గా వ్యతిరేకిస్తున్నారు. మున్సిపాల్టీలో పారిశుధ్య లోపంపై సర్వ సభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు అధికారులను నిలదీస్తున్నా.. వారి తీరులో మార్పు రావడం లేదు. పారిశుధ్య మెరుగుకు కనీస చర్యలు తీసుకోవడం లేదు. మరోవైపు పట్ట ణంలో నిషేధిత పాలథిన్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువులు, డిస్పోజల్ గ్లాసుల క్రయ విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. వాటర్ ప్యాకెట్లు కూడా మార్కెట్లో దర్శనమిస్తున్నాయి. కొంద రు వ్యాపారులు యథేచ్ఛగా కుళ్లిన మాంసం, పాడైన చేపల అమ్మకాలు చేపట్టి ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. వాటిపైనా కూడా అధికారులు దృష్టి సారించడం లేదు.



పట్టణంలోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్తాచెదారం

మున్సిపల్ కార్మికులపై పనిభారం

పట్టణంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచడం లేదు. ప్రస్తుతం మున్సిపాల్టీలో 85 మంది కాంట్రాక్టు పద్ధతిపై, 35 మంది శాశ్వత ప్రాతిపదికన పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. దీంతో వారిపై పనిభారం పెరుగుతోంది. కార్మికుల సంఖ్యను పెంచాలని ఎన్నిసార్లు వారు అధికారులను కోరుతున్నా.. ఫలితం శూన్యం. దీనిపై పట్టించుకునే వారే కరువయ్యారు. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించాలని పుర ప్రజలు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం..

పట్టణంలో దోమలు, ఈగల నియంత్రణకు చర్యలు చేపడుతున్నాం. ఎక్కడా చెత్తలు కూడా లేకుండా చూస్తున్నాం. షాపుల్లో నిషేధిత వస్తువులు విక్రయిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- పకీర్‌రాజు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్, సాలూరు

కల్యాణ మహోత్సవానికి తోటపల్లి ముస్తాబు



గరుగుబిల్లి, ఫిబ్రవరి 11 : ఉత్తరాంధ్రలో చిన తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానం కల్యాణ మహోత్సవానికి ముస్తాబవుతోంది. ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనుండగా.. ఇందుకు సంబంధించి ఆదివారం ఆలయంలో కల్యాణ వార్షికోత్సవ పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో సూర్యనారాయణ మాట్లాడుతూ.. ఏటాలానే ఈ సారి కూడా మహాశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని కల్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19 నుంచి 24 వరకు ప్రత్యే పూజలు , తిరువీధి మహోత్సవం, కల్యాణం, శ్రీచక్ర తీర్థ స్నానం, శ్రీమూర్ణోత్సవం చేపడతామని వెల్లడించారు. కల్యాణంలో పాల్గొనే భక్తులు ముందుగా దేవస్థానం కార్యాలయంలో రూ.500 చెల్లించి రశీదు పొందాలన్నారు.

ఫిట్ నెస్ – లెస్

- పాఠశాల బస్సుల్లో కానరాని భద్రత
- పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్న వైనం
- తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు



మార్గమధ్యలో నిలిచిపోయిన స్కూల్ బస్సును నెడుతున్న విద్యార్థులు, సిబ్బంది (ఫైల్)

రాజాం

రాజాం పట్టణంలోని ఓ కార్పొరేట్ పాఠశాలకు చెందిన బస్సు సామర్థ్యం 40 సీట్లు మాత్రమే. కానీ 60 మంది వరకూ విద్యార్థులను ఎక్కించుకుంటోంది. దీంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. పెద్ద బస్సు వేస్తామని చెబుతున్న సంబంధిత పాఠశాల యాజమాన్యం అదిగో ఇదిగో అంటోందే తప్ప వేయడం లేదు. దీంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

..ఒక్క రాజాంలోనే కాదు. జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. ఈ ఏడాది ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల విలీనం, విద్యాబోధన పడిపోవడం, పదో తరగతి ఉత్తీర్ణత తగ్గుముఖం పట్టడంతో ఎక్కువ మంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పుతున్నారు. ఇదే అదునుగా ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయి. ప్రధానంగా రవాణా చార్జీలు రెట్టింపు చేసి వసూలు చేస్తున్నాయి. కానీ వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకుంటున్నాయి. దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 800కు పైగా స్కూల్ బస్సులు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే వీటి ఫిట్‌నెస్‌ను పరిశీలించాలి. ఈ ఏడాది రవాణా శాఖ అధికారుల తనిఖీల్లో కేవలం 400 బస్సులే ఫిట్‌నెస్ సాధించినట్టు తెలుస్తోంది. కొన్ని పాఠశాలలు అనధికారికంగా బస్సులను నడుపుతున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయి. వాస్తవానికి కండీషన్‌లో ఉన్న బస్సులనే వినియోగించాలి. 15 ఏళ్లు దాటిన బస్సులను అస్సలు వినియోగించకూడదు. కానీ కొన్ని పాఠశాలలు పాత బస్సులకు రంగులు వేసి నడుపుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

- స్కూల్ బస్సు డ్రైవర్ ఎంపిక కూడా చాలా కీలకం. శిక్షణ పొందిన, ఆరోగ్యంగా ఉన్న డ్రైవర్లనే ఎంపిక చేయాలి. ముందుగా వారి నుంచి ఫిట్‌నెస్ పొందాలి. కంటిచూపు సక్రమంగా ఉండడంతో పాటు మూర్ఛ వంటి వ్యాధులు లేని వారిని ఎంపిక చేసుకోవాలి. నిష్ణాతులైన డ్రైవర్లకు అధిక వేతనం ఇవ్వాల్సి వస్తోందని కొన్ని యాజమాన్యాలు వయసు పైబడిన వారిని సైతం డ్రైవర్లుగా ఎంపిక చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. బస్సు డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. కానీ కొందరు లైట్ వెహికిల్ లైసెన్స్ ఉన్నవారిని సైతం బస్సు డ్రైవర్లుగా ఎంపిక చేస్తున్నట్టు తెలుస్తోంది.

- వాస్తవానికి స్కూల్ బస్సులకు సంబంధించి 32 అంశాలతో కూడిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పనిసరి. బస్సులో విద్యార్థుల వివరాల పట్టిక నమోదు చేయాలి. బస్సు ముందు, వెనుక భాగాల్లో స్కూల్ బస్సు, ఆన్ స్కూల్ డ్యూటీ అని రాయాలి. బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్సు, ఎమర్జెన్సీ డోర్ ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాద నివారణ పరికరాలు అందుబాటులో ఉంచాలి. కిటికీలకు నెట్ తప్పనిసరిగా ఉంచాలి. బస్సు తలుపులకు లాకింగ్ సిస్టమ్ ఏర్పాటుచేయాలి. బస్సులో పిల్లల కోసం సహాయకులను నియమించాలి. గంటకు 40 కిలోమీటర్ల వేగానికి మించకుండా స్పీడ్ గవర్నెన్స్ ఏర్పాటుచేయాలి. డ్రైవర్‌కు హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు నాలుగేళ్ల అనుభవం ఉండాలి. కానీ మెజార్టీ బస్సులకు ఇవేవీ అమలవుతున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా వీటిపై జిల్లా అధికారులు దృష్టి పెట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

● ఫిట్‌గా ఉండాల్సిందే

స్కూల్ బస్సులకు విధిగా ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి. పక్కాగా నిబంధనలు పాటించాలి. విద్యార్థుల భద్రతే ధ్యేయం. ఫిట్‌నెస్ పరీక్ష చేయని బస్సులను సీజ్ చేస్తాం. అవసరమైతే యాజమాన్యాలపై కేసులు నమోదు చేస్తాం. ప్రతి బస్సుకు విధిగా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకోవాలి. ఏడాది మొత్తం రవాణా శాఖ తరపున తనిఖీలు చేపడతాం. మా ఆదేశాలను పాటించకపోతే ఎంతటి వారైనా కేసులు నమోదు చేయక తప్పదు.

-ఎన్ రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, రాజాం

చంద్రబాబుతో బంగారు భవిష్యత్తు



బాబుష్యూరిటీ కార్యక్రమంలో లలితకుమారి, టీడీపీ నాయకులు

శృంగవరపుకోట రూరల్, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో అదోగతిలో మునిగిపోయిన రాష్ట్రానికి తిరిగి బంగారు భవిష్యత్ అందించే ఏకైక వ్యక్తి తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడు మాత్రమే అని శృంగవరపుకోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని తలారి గ్రామంలో మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న ఆధ్వర్యంలో బాబూష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లలితకుమారి మాట్లాడుతూ సైకో పాలనలో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, తెలుగుదేశం పాలన కావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో జీఎస్ నాయుడు, రోహిణీ కుమార్, మోహన్‌రాజ్ ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

దత్తిరాజేరు, ఫిబ్రవరి 11: మండలంలోని చౌదంతివలస జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందిన ఘటన ఆదివారం తెల్లవారు జామున చోటుచేసుకుందని స్టేషన్ బూర్జవలస ఎస్‌ఐ లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. మృతురాలి వయస్సు 55 సంవత్సరాలు ఉంటుందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ఎంఆర్ ఆసుపత్రికి తరలించామన్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆచూకీ తెలిసిన వారు 9121109461కు సంప్రదించాలని తెలిపారు.

ఆరు కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

పాచిపెంట: మండలంలోని పి.కోనవలస చెక్ పోస్టు వద్ద ఆదివారం వాహన తనిఖీలు చేస్తుండగా ఆరు కిలోల గంజాయితో ఇద్దరు పట్టుబడ్డారని స్థానిక ఎస్‌ఐ పి.నారాయణ రావు తెలిపారు. ఈ మేరకు ఒడిశా ప్రాంతం ముండగడ్డి గ్రామానికి చెందిన సోనియా జాని, సిరిగుడకు చెందిన కేదార్‌నాథ్ పాత్రోలను పట్టుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. వారి వద్ద నుంచి ఆరు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ



శ్రీరాంపురంలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

లక్కవరపుకోట, ఫిబ్రవరి 11: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో ఆదివారం అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ పెద్దలు, యువకులు సహాయంతో నిర్మించిన నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని వేదమంత్రాల సాక్షిగా నిర్వహించారు. గ్రామ పెద్దలు వడ్లమాని శేషావతారం, దావాల కృష్ణస్వామి, ఓనుము రమణ, యువకులు బండారు అప్పలనాయుడు, భోజంకి చిన్నంనాయుడు, వి.చెల్లయ్య, జి.ముత్యాలనాయుడు తదితరులు ప్రతిష్టా కార్యక్రమాన్ని దగ్గరుండి నిర్వహించారు.గ్రామస్థులు ఉదయం నుంచి ఆంజనేయస్వామికి సిందూరం, తమలపాకులు, నిమ్మకాయలతో ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం పాదాలమ్మ గ్రూపుచే కోలాటం, కోదండరామ గ్రూపుచే భజనలు నిర్వహించారు. మధ్యాహ్నం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహిళలు రోడ్డెక్కండి

రాజాం, ఫిబ్రవరి 11: అధికారం కట్టబెడితే మద్య నిషేధం చేస్తానని గత ఎన్నికల ముందు రాష్ట్ర వ్యాప్తంగా మైక్ పట్టుకొని ఊదరగొట్టిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గద్దెనెక్కిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా తనకు నచ్చిన బ్రాండ్లను మద్యాన్ని ఏరులై పారిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతు న్నారని ఆరోపించారు. దీనిపై మహిళలు రోడ్డెక్కి ప్రశ్నించాలని రాజాం టౌన్ టీడీపీ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు. మద్యంతో పాటు గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతుండటంతో యువత పూర్తిగా పాడైపోయారని, దీనిపై మహిళలు పిడికిలు బిగించి రోడ్డెక్కి గర్జించాలన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

బాడంగి: అమ్మ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శంకర్ ఫౌండేషన్ వైద్యులు రోగులకు చికిత్స నిర్వహించారు. 95మంది హాజరుకాగా వారిలో 48 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం శంకర్ ఫౌండేషన్ బస్సులో ఆసుపత్రికి తరలించారు. అమ్మ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు దేవరపు సురేష్, కార్యదర్శి పి.సతీష్, డి.చిన్నారావు, వెంకి, ఆప్తమాలిక్ ఆఫీసర్ జాక్సన్, బి.రమేష్‌కుమార్, క్యాంపు కోఆర్డినేటర్ వెంకటరమణ, అమ్మ సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం తీరు అన్యాయం

బొబ్బిలి: ప్రపంచంలో ఉన్న ప్రతి తెలుగువాడు గర్వించదగ్గ వ్యక్తి, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు భారతరత్న వస్తే మాట మాత్రంగానైనా సీఎం జగన్ ప్రస్తుతించలేకపోవడం చాలా అన్యాయమని పీసీసీ మెంబరు మువ్వల శ్రీనివాస రావు అన్నారు. పీవీకి భారతరత్న రావడంపై మీ స్పందన ఏమిటని ఢిల్లీలో మీడియా ప్రతినిధులు అడిగినప్పుడు తన స్పందన చెప్పకుండా సీఎం ముఖం చాటేయడం సిగ్గుచేటన్నారు.

జగన్ పాలనకు చరమగీతం పాడాలి

రామభద్రపురం: రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడాల్సిన అవసరం ఎంతైనా ఉందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మడక తిరుపతినాయుడు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ఈ వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో భ్రష్టుపట్టించిందని ఆరోపించారు. ప్రజలు నిత్యవసర ధరలు, విద్యుత్ చార్జీలతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. కొత్త పరిశ్రమలు తెప్పించడంలో జగన్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఇప్పటినుంచే తెలుగుదేశం కార్యకర్తలు ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. ఆయన వెంట సత్యనారాయణ పాల్గొన్నారు. బాడంగి మండలం పిన్నవలస సమీపంలో సభ జరుగుతుందని, ఈ సభకు నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోటరీ సేవలను ముమ్మరం చేద్దాం

బొబ్బిలి: రోటరీ అంతర్జాతీయ సంస్థ ద్వారా సామాజిక సేవలను మరింత ముమ్మరం చేద్దామని రోటరీ డిస్ట్రిక్ట్ 3020 డీజీఈ డాక్టర్ వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక టీబీఆర్ కన్వెన్షన్‌లో అంతర్జాతీయ రోటరీ సంస్థకుచెందిన ఆరు జిల్లాల ప్రతినిధుల రెండు రోజుల సెమినార్ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఆదివారం రెండో రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచ సమస్యలు-రోటరీ పాత్ర అనే అంశంపై చర్చించారు. సభ్యత్వం, పబ్లిక్ ఇమేజ్, పోలియో నిర్మూలనం, రోటరీ ఫౌండేషన్, ఆన్‌లైన్ టూల్స్ అంశాలపై సెమినార్ నిర్వహించారు. రోటరీక్లబ్ బొబ్బిలి అధ్యక్షుడు జేసీ రాజు, రీజనల్ కార్యదర్శి తూముల కార్తీక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

'ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా' పుస్తకావిష్కరణ

విజయనగరం దాసన్నపేట: భారతీయ భాషల పునరుద్ధరణకు పరిశోధనలు విస్తృతస్థాయిలో జరగాలని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ టీవీ కట్టమణి అన్నారు. ఆదివారం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా - ఇట్స్ రిలయన్సస్ అనే పరిశోధన పుస్తకాన్ని ఆదివారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గుంతలు పూడ్చివేత

బొబ్బిలి: పట్టణ పరిధిలోని బొబ్బిలి-పాతబొబ్బిలి మెయిన్ రోడ్డు పూర్తిగా పాడవడంతో సామాజిక కార్యకర్త విజయమోహన్ ఆధ్వర్యంలో యువకులు శ్రమదానం చేసి గుంతలను పూడ్చుకున్నారు. ప్రతివారం ఈ కార్యక్రమం చేపట్టి గుంతలు పూడ్చే పనిపెట్టుకున్నట్లు వారు తెలిపారు.



గుంతలు కప్పుతున్న దృశ్యం

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నేడు నోటిఫికేషన్

- ఖాళీల సంఖ్యపై నిరుద్యోగుల్లో అసంతృప్తి
- సీఎం మాట తప్పారంటూ ఆవేదన

సాలూరు రూరల్, ఫిబ్రవరి 11: ఏటా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామనే వైసీపీ ప్రభుత్వ హామీకి భిన్నంగా ఎట్టకేలకు డీఎస్సీ నోటిఫికేషన్ ఈ నెల 12న విడుదల కానున్నది. ఏటా డీఎస్సీ ఉంటుందని పాదయాత్రలో సీఎం జగన్ హామీ మేరకు నిరుద్యోగ యువత డీఎడ్, బీఎడ్‌లను పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రభుత్వం ఏర్పడి నాలుగేన్నరేళ్లు కావస్తున్నా డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడ లేదు. మెగా డీఎస్సీపై ఆశలు పెట్టుకున్న నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఎట్టకేలకు స్వల్పసంఖ్యలో పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తుండడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రతిపాదికనే డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడనున్నది. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎస్జీటీలు 103, పాఠశాల సహాయకులు 97, టీజీటీ 84 మొత్తంగా 284 ఉపాధ్యాయ ఖాళీలను చూపించే అవకాశముంది. జిల్లాలో ఉపాధ్యాయ పోస్టులు తగ్గిపోవడంపై అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2021-2022, 2022-2023 ఏడాదిలో జీవో 117 ప్రకారం వీలినం, హేతుబద్ధీకరణ చేయడం వల్ల పోస్టులు తగ్గిపోయినట్టు ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. గతేడాది జిల్లాలో రెండో ఎంఈవో పోస్టుల కోసం ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్‌కు చెందిన 112 పోస్టులు, ఆదర్శపాఠశాలల్లో పోస్టులు సృష్టించడానికి 397 ఉపాధ్యాయ పోస్టులు, కర్నూల్ జిల్లాలో ఎస్జీటీ పోస్టులు మంజూరు తక్కువగా ఉండడంతో జిల్లా నుంచి 139 ఎస్జీటీ పోస్టులు సర్దుబాటు చేయడంతో ఇక్కడ అవి రద్దు అయినట్టు నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు, ఉపాధ్యాయ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. దీంతో ప్రస్తుత డీఎస్సీకి స్వల్ప సంఖ్యలోనే పోస్టులు మిగిలినట్టు వారు అభిప్రాయపడుతున్నారు. టీడీపీ ఐదేళ్ల కాలంలో 2014లో 339, 2018లో 377 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసింది. 2014లో 23,592 మంది, 2018లో 32,711 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. ఐదేళ్ల ఈ ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించకపోవడం వల్ల ప్రస్తుత డీఎస్సీకి 45 వేల మందికి పైబడి పోటీ పడే అవకాశముందని భావిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్ర చివరి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కిరణ్‌కుమార్ రెడ్డి డీఎస్సీలో రద్దు చేసిన అప్రెంటీస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెడుతున్నారు. తొలి ఏడాది పేస్కేల్‌లో 50 శాతం, తదుపరి ఏడాది 60 శాతం వేతనం చెల్లించనున్నారు. రెండేళ్ల అనంతరం రెగ్యులర్ చేయనున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ వెలువడితే గాని పూర్తి వివరాలు స్పష్టం కావు. డీఎస్సీ షెడ్యూల్ ఇలా ఉంటుంది. నోటిఫికేషన్ ఈ నెల 12, దరఖాస్తులకు ఫీజు చెల్లింపు ఈ నెల 12 నుంచి 21 వరకు దరఖాస్తుల సమర్పణ ఈ నెల 12 నుంచి 22 వరకు, ఆన్‌లైన్ మాక్ టెస్ట్ ఈ నెల 24 నుంచి, హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్, వచ్చే నెల 5 నుంచి చేసుకోవచ్చు. ఉపాధ్యాయ నియామకానికి వచ్చే నెల 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రోజుకు రెండు విడతలుగా పరీక్షలను నిర్వహించనున్నారు. ప్రాథమిక కీ విడుదల వచ్చే నెల 31, కీపై అభ్యంతరాలు స్వీకరణ ఏప్రిల్ 1, ఫైనల్ కీ ఏప్రిల్ 2, డీఎస్సీ ఫలితాలు ఏప్రిల్ 7న వెలువరించనున్నారు. ఈ డీఎస్సీకి ప్రిపరేషన్‌కే కొద్ది కాలమే వ్యవధి ఉండడంతో అభ్యర్థులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు.

టీడీపీ విజయమే లక్ష్యం

- గొప్ప సిద్ధాంతాలు కలిగిన పార్టీ తెలుగుదేశం
- విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 11: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పార్టీ కార్యాలయంలో 6వ డివిజన్‌కు చెందిన దాసన్నపేట ప్రాంతంలోని సీఆర్ నగర్, ప్రశాంత్‌నగర్, జమ్మూ ప్రాంతాలకు చెందిన వైసీపీ నాయకులు రౌతు అప్పలనాయుడు, నారాయణరావు, అమ్మలకంటి రవి, వెలుదూటి శ్రీను, పంచాది పెంటయ్యతో పాటు 70 కుటుంబాలకు చెందిన వారు టీడీపీ నాయకుడు రౌతు నర్సింహామూర్తి, టీడీపీ తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు గంటా రవి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారికి అదితి గజపతిరాజు పసుపుకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మంచి సిద్ధాంతాలు గల పార్టీ టీడీపీయేనన్నారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి సభ్యత్వ నమోదు, సంస్థాగత ఎన్నికలు నిర్వహించుకోవడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా, ప్రజాపక్షంగానే టీడీపీ నిలిచిందన్నారు. పార్టీలో వచ్చిన వారంతా పాతవారందరితో కలిసి ఆయా ప్రాంతంలో టీడీపీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, ప్రసాదుల ప్రసాద్, షైలిపిల్లి పైడిరాజు, కింగ్ ఆర్ప్ రాజు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు, ఇతర టీడీపీ నాయకులు

దత్తిరాజేరు: పెదకాద గ్రామంలో 30 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో రెడ్డి సత్యం, వంగపండు సత్యం, కొల్లి ఈశ్వరరావు, గాజాపు సీతయ్య, వంగపండు కన్నంనాయుడులతో పలువురు చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 16న గంట్యాడలో శంకారావం అనే పేరుతో నిర్వహిస్తున్న లోకేష్ పర్యటనను ఉన్నందున విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు పెద్దింటి మోహన్, మాజీ జడ్పీటీసీ బండారు బాలాజీ, వేమలి చైతన్యబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, పెద్దింటి జగన్, బెజవాడ బంగారునాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ శంఖారావంతో వైసీపీలో వణుకు

- మాజీ మంత్రి కోండ్రు

రాజాం, ఫిబ్రవరి 11: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పూరించిన శంఖారావంతో వైసీపీలో వణుకు మొదలైందని మాజీ మంత్రి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ విమర్శించారు. ఆదివారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్‌తోనే రాష్ట్ర ప్రజలకు భరోసా, యువతకు ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. సీఎం జగన్‌ను సాగనంపడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నారా లోకేష్ పూరించిన శంఖారావం కార్యక్రమం ఈనెల 15 వతేదీన రాజాంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. లోకేష్ కార్యక్రమానికి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, పెద్దఎత్తున సమాయత్తం కావాలని కోండ్రు పిలుపునిచ్చారు. ప్రజల్లో స్పష్టమైన మార్పు చేసిన గాలివీస్తుందన్నారు. గతంలో లోకేష్ చేసిన యువగళం పాదయాత్రతోనే వైసీపీ పతనం ప్రారంభమైందన్నారు. ఓటమి ఖాయమని తెలిసే జగన్ మాటల్లో మార్పు కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో నిత్యవసర వస్తువులు విద్యుత్ చార్జీలు ధరలు పెంచి సామాన్య ప్రజానికానికి తీరని అన్యాయం చేశారన్నారు. సుమల వెంకట మన్మథరావు, పి స్నింటి మోహన్‌రావు, కిమిడి అశోక్‌కుమార్, గట్టి భాను, పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు, గురవాన నారాయణరావు, దుప్పలపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోండ్రు, హాజరైన టీడీపీ శ్రేణులు

ఇసుక రీచ్‌ల పరిశీలన

- ఇసుకనిల్వలు, అక్రమరవాణాపై ఆరా తీసిన అధికారులు

రేగిడి, ఫిబ్రవరి 11: మండలంలో కొమిరివెంకటాపురం, సంతకవిటి మండలం తమరాం నాగావళీ ఇసుకరీచ్‌లను అధికారుల బృందం ఆదివారం తనిఖీ చేశారు. మైన్స్ ఏడీ సూర్యచంద్ర, చీపురపల్లి ఆర్డీవో శాంతి, డీఎస్పీ శ్రీనివాస్‌చక్రవర్తి, ఇతర అధికారులు ఈ రేవుల్లో ఉన్న ఇసుకనిల్వలు, గతంలో ఇక్కడ అధికారిక రీచ్‌లు నిర్వహణ, అక్రమరవాణా వివరాలను స్థానికుల నుంచి ఆరాతీశారు. ఈరీచ్‌ల్లో టైర్లు అనవాళ్లు, అక్కడక్కడ ఇసుక కుప్పలు ఉన్నట్లు బృందం గుర్తించినట్లు సమాచారం. ఉన్నతాధికార్లు ఆదేశాల ప్రాప్తికి ఈరెండు రేవులు పరిశీలించారని, ఇక్కడ తనిఖీ సమయంలో అక్రమరవాణా ఏమీ లేదని, ఈమేరకు గ్రామస్థులు చెప్పినట్లు మైన్స్‌ఏడి, ఆర్డీవో వెల్లడించారు. ఈతనిఖీలో రాజాం రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు, తహశీల్దార్ రాములమ్మ, స్థానిక ఎస్‌ఐ ఈ శ్రీనివాస్ ఉన్నారు.



కొమిర వెంకటాపురం రీచ్‌ను అధికార్ల బృందం తనిఖీ దృశ్యం

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



వాసవీమాతకు పూజలు చేసిన భక్తులు

శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవర గ్రామంలో ఉన్న శ్రీలక్ష్మిగణపతి ఆలయంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆత్మర్పణ దినోత్సవం నిర్వహించారు. ఆదివారం వాసవీ మహిళ క్లబ్ అధ్యక్షురాలు పూసర్ల కొటిరత్నం ఆధ్వర్యంలో వాసవీమాతకు పూజలుచేసి దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో కందుకూరి పద్మావతి, కల్లూరి ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 11: పదో, తరగతి ఇంటర్ పరీక్షలకు భయం వీడి సిద్ధం కావాలని ఎస్టీయూ రాష్ట్ర నాయకులు డి.శ్యామ్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా పదో తరగతి విద్యార్థులకు నమూనా ఏర్పాటు చేశారు. ఈ నమునాను జిల్లా కేంద్రంలోని చైతన్య స్కూల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ, ఏఐఎస్ఎఫ్ స్వాతంత్ర్య సంగ్రామంలో పుట్టిన మొట్టమొదటి విద్యార్థి సంఘం అన్నారు. నాటి నుంచి నేటి వరకూ విద్యా వ్యతిరేక విధానాలపైన, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పోరాటాలు కొనసాగిస్తుందని, విద్యార్థులకు అవగాహన పరచడంలో ముందుందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత పావని మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు, సమాజంలో ఉన్న మార్పులు కూడా పరిగణలోకి తీసుకుని సమాజానికి సేవలు అందించాలన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, నాగభూషణం, సుమన్, గౌరీశంకర్, భాను తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: వచ్చే నెలలో జరగనున్న పదోతరగతి పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి బిడియం లేకుండా ఆత్మస్థైర్యంతో సమాధానాలు రాసుకోవాలని ఎస్‌ఐ జి.లోవరాజు అన్నారు. అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ట్రిపుల్ ఎస్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మోడల్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌ఐ లోవరాజుతో పాటు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత రౌతు రామ్మూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా సిలబస్‌ను పూర్తి చేసుకోవాలని, ఆహా రపు క్రమశిక్షణ పాటించాలన్నారు. ఎటువంటి మానసిక ఒత్తిడికి గురికావద్దన్నారు. రామ్మూర్తి మాట్లాడుతూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షల కోసం మానసికంగా సిద్ధం చేసేందుకు ఏఐఎస్ఎఫ్ చేస్తున్న కృషిని అభినందించారు.



విజయనగరం: సన్నాహక పరీక్షల పేపర్లను విడుదల చేస్తున్న దృశ్యం

లోకేష్‌ను కలిసి రావాడ



లోకేష్‌ను కలిసి బొకే అందజేస్తున్న రావాడ సీతారాం

రాజాం: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం ఆదివారం చిలకపాలెం కూడలిలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఎస్సీ నియోజకవర్గంలో టికెట్ ఇస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, స్థానిక నాయకుల అండదండలు ఉన్నాయని అందుకు తగిన ఏర్పాట్లు కూడా చేసుకుంటానని సీతారాం తెలిపారు. ముందుగా పార్టీని బలోపేతం చేయడానికి, యువతను చైతన్యం చేయడానికి కృషి చేస్తే పార్టీ కోసం పనిచేసిన వారికి అన్ని విధాలుగా అవకాశం కల్పిస్తామని లోకేష్ హామీయిచ్చారన్నారు.

ఓపీఎస్ సాధన కోసం పోరాటానికి కార్యాచరణ

బొబ్బిలి: సీపీఎస్, జీపీఎస్‌లను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించినట్లు రాష్ట్ర యూటీఎఫ్ మహిళా నేత కె.విజయగౌరి తెలిపారు. స్థానిక గాంధీ విగ్రహం ముందు ఆదివారం సాయంత్రం పోరాట కార్యాచరణ గోడప త్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. 'మాటతప్పను, మడమ తిప్పను' అని చెప్పడంతో ఉద్యోగులంతా ఎంతో నమ్మకం పెట్టుకున్నారని, కానీ సీఎం మాట తప్పారన్నారు. అందుకే మన ఓటు-మన భవిష్యత్, ఓట్ ఫర్ సీపీఎస్ అనే నినాదంతో పోరాటాన్ని ఉధృతం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పల్లా సత్యనారాయణ, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 11: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలో ఉన్న నవ్యాంధ్ర ప్రజా గ్రంథాలయానికి మదర్‌థెరిస్సా సేవా సంఘం బ్లడ్ డోనర్స్ క్లబ్ వ్యవస్థాపకులు త్యాడ ప్రసాదప ట్నాయక్ రూ.5 వేలు విలువ చేసే కాంపిటేటివ్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ఎరుకొండ ఆనంద్ మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే కాంపిటేటివ్ పుస్తకాల ను వితరణ చేయడం అభినందనీయమన్నారు. ఇటువంటి గ్రంథాలయానికి పేదలకు ఉపయోగపడే పుస్తకాలు అందించేందుకు దాతలు సహకరిస్తే, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమన్నారు. గ్రంథాలయ ప్రతినిధులు షన్ముఖరావు, టీవీ దుర్గారావు, ఈఎస్ఎన్ రాజు, ఝాన్సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి



వసతులు కరువైన మల్లమ్మపేట శ్మశానం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపల్ పరిధిలోని మల్లమ్మపేట గ్రామంలో గల శ్మశానాన్ని అభివృద్ధి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఆరు వార్డుల ప్రజలకు చెందిన ఈ శ్మశానం అభివృద్ధి చేసేందుకు నాయకులు, అధికారులు చిత్తశుద్ధిని ప్రదర్శించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరైనా కాలం చెల్లితే ఆ మృతదేహాల దహనసంస్కారాల నిర్వహణ సమయంలో గ్రామస్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సరైన రహదారి, షెడ్, బోరు, దహనవాటిక వంటివి లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. వర్షాకాలంలో నరకయాతనకు గురికావాల్సి వస్తోందని, వేసవి కాలంలో ఎండ బెడదతో అవస్థలు పడుతున్నామన్నారు. సుమారు పదివేల మంది జనాభాకు చెందిన శ్మశానాన్ని అభివృద్ధి చేసేందుకు అనేక రకాల నిధులను ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నప్పటికీ మల్లమ్మపేటకు ఈ నిధులను ఎందుకు కేటాయించడం లేదని కొప్పలవెలమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోల జగన్ ప్రశ్నించారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

సీతానగరం: అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందజేయడంలో ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంవో డా.టి.జగన్మోహన్‌రావు ఆదేశించారు. సీతానగరం పీహెచ్‌సీని ఆయన ఆదివారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. మందులు, వైద్య పరికరాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని, స్వయంగా ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీ ప్రధాన రహదారికి సమీపంలో ఉన్నందున అత్యవసర చికిత్స అవసరమైనవారు వస్తుంటారు కావున సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, కుక్కకాటు, పాముకాటు, జ్వర లక్షణాలు ఇతరత్రా అత్యవసర అనారోగ్య సమస్యలకు గురైన వారికి అవసరమైన చికిత్స పీహెచ్‌సీలో ఉండాలని ఆయన సూచించారు.

సరళంగా 'కారా' మాస్టారు రచనలు


మాట్లాడుతున్న రచయిత గౌరునాయుడు

బెలగాం: కథకుల గురువు కాళీపట్నం రామారావు(కారా) మాస్టారు రచనలు సరళంగా ఉంటాయని పలువురు కవులు, రచయితలు అన్నారు. ఆదివారం స్థానిక గిరిజన భవన్‌లో 'కథకుల గురువు కారా మాస్టారి కథలతో కొంతసేపు' సాహితీ కార్యక్రమం గేరా అధ్యక్షతన నిర్వహించారు. కారా మాస్టారి శతజయంతి, కథా నిలయం వార్షికోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్రలో పలు చోట్ల ఈ కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురంలోని జరిగిన ఈ కార్యక్రమంలో ఆముదాలవలస సాహితీ స్రవంతికి చెందిన వీవీఎస్ మూర్తి, సహజ సాంస్కృతిక సంస్థకు చెందిన ఎన్‌కే బాబు, శ్రీకాకుళం సిక్కోలు బుక్ ట్రస్టుకు చెందిన రచయి త దుప్పల రవికుమార్ పాల్గొని కారా మాస్టారు సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్ని, నిబ ద్ధతను వివరించారు. ఈ కార్యక్రమంలో రచయితలు గంటేడ గౌరునాయుడు, శాంతి, కుమార్‌వర్మ, జగదీష్, పక్కి రవీంద్ర, స్వామినాయుడు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై పాఠశాలల్లో అవగాహన

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని రైతు సాధికార సంస్థ సీనియర్ సలహాదారుడు డా.డి.పారినాయుడు తెలిపారు. ఆదివారం తోటపల్లి జట్టు ట్రస్ట్ కార్యాలయంలో బడి నుంచి పొలంబడికి పాఠ్యాంశాల రూపకల్పనలో భాగంగా రచయితలతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీ మార్గదర్శకాల మేరకు 2వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు రూపకల్పన చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా దేశీయ ఆవు ప్రాముఖ్యతపై రచయిత రౌతు వాసుదేవరావు రచించిన గేయాలను, కథలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కె.దాలినాయుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బి.భీమేశ్వరరావు రచయతలు పాల్గొన్నారు.

ఆసరా చెక్కుల పంపిణీ

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లిలో ఆదివారం నాలుగో విడత వైఎస్‌ఆర్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని 975 గ్రూపులకుగాను 11,375 మంది లబ్ధిదారులకు రూ.5.56 కోట్లు విలువగల చెక్కును అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గేదెల సింహాద్రప్పలనాయుడు, జడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, మాజీ జడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, వైస్ ఎంపీపీలు భమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, మండల శాఖాధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పదవీ విరమణ వెంటనే బెనిఫిట్ ఇవ్వాలి

- ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

సాలూరు రూరల్: పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారికి రావాల్సిన గ్రాట్యుటీ తదితర బెనిఫిట్స్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ పార్వతీపురం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లా బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ 257 రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. అనంతరం ఫోన్‌లో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పదవీ విరమణ చేస్తున్న వారికి తదుపరి చెల్లిస్తామని బాండ్‌లివ్వడం సరికాదన్నారు. వారికి వెంటనే నగదు ఇస్తే వారి అవసరాలు తీరుతాయన్నారు. ఈ కౌన్సిల్ సమావేశంలో పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు మర్రాపు మహేశ్వరరావు, విజయనగరం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు షేక్ బుఖారి, పాల్తేరు శ్రీనివాసరావు పాల్గొన్నట్టు చెప్పారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

గజపతినగరం: పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా ఆదివారం గజపతినగరం పట్టణంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కోకన్వీనర్ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, మండపాక భారతి తదితరులు పాల్గొన్నారు.

స్టెప్పులేసిన డిప్యూటీ సీఎం


చిన్నారులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న డిప్యూటీ సీఎం

సాలూరు రూరల్: సాలూరులోని ఓ పాఠశాల వార్షికోత్సవంలో డిప్యూటీ సీఎం రాజన్నదొర స్టెప్పులేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా వెళ్లారు. ఈసందర్భంగా చిన్నారులతో కలిసి కొద్దిసేపు స్టెప్పులేసి ఆహుతులను ఉత్సాహపరిచారు.

ఢిల్లీ బయలుదేరిన పెన్షనర్ల సంఘం నాయకులు



నినాదాలు చేస్తున్న పెన్షనర్ల సంఘ నాయకులు

గరివిడి: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఢిల్లీలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమానికి గరివిడి నుంచి పలువురు నాయకులు ఆదివారం బయలుదేరారు. బయలుదేరిన వారిలో ఈపీఎఫ్ పెన్షన్ సంఘం నాయకులు ఏఏ గౌరినాయుడు, సలీం కరణం సన్యాసినాయుడు, కలశ సూరప్పడు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీలో పార్శిల్ సేవలు ఉపయోగించుకోండి


పార్శిల్ గదిని పరిశీలిస్తున్న అప్పలనాయుడు

కొత్తవలస: కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సు నుంచి వ్యాపారులు తమ పార్శిల్స్‌ను బుక్ చేసి పంపించుకోవచ్చునని ఏపీఎస్ ఆర్టీసీ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం ఆయన కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సును సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులు, వ్యాపార సంస్థలు వారికి సంబంధించిన పార్శిల్స్‌ను బుక్ చేసుకోవడానికి, బుక్ చేసుకుని వచ్చిన పార్శిల్స్ భద్రపర్చుకునేందుకు అవసరమైన గదులు కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్సులో ఏర్పాటు చేశామని చెప్పారు. కార్గో సెక్షన్, బస్సుల అత్యవసర తలుపులను పరిశీలించారు. ప్రయాణికులు, వ్యాపార సంస్థలు కొత్తవలసలో ఏర్పాటు చేసిన పార్శిల్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్టణం డిపో మేనేజర్ ధీరజ్ పాల్గొన్నారు.

నేడు ఇసుక వేలం

గరివిడి: అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడిన ఇసుకను సోమవారం ఉదయం గరివిడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నామని ఎస్ఐ దామోదర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. చీపురుపల్లి సర్కిల్ గరివిడి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలో గత రెండు నెలల కిందట అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ని పట్టుకుని కేసు నమోదు చేశామని చెప్పారు. కోర్టువారి రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు సీజ్ చేసిన ఇసుకను సోమవారం ఉదయం బహిరంగ వేలం వేస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

లోకేశ్ పర్యటనను విజయవంతం చేద్దాం

- పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో 'శంఖారావం'
- జన సమీకరణకు టీడీపీ నాయకుల సమాయత్తం


మక్కువ: మాట్లాడుతున్న సంధ్యారాణి


పార్వతీపురం: మాట్లాడుతున్న విజయచంద్ర

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పేరిట ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.

మక్కువ: టీడీపీ యువ నేత నారా లోకేశ్ ఈనెల 14న నిర్వహించనున్న శంఖారావం సభకు పార్టీ నాయకులు పెద్దఎత్తున తరలి రావాలని పార్టీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ లోకేశ్ సభను విజయవంతం చేయడానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్, పార్టీ నాయకుడు మావుడి ప్రసాదరావు, కార్యదర్శి బి.గౌరీశంకర్ పాల్గొన్నారు. ● **గరుగుబిల్లి:** నారా లోకేష్ నిర్వహిస్తున్న శంఖారావానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని నాగూరు ఎంపీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి సత్యనారాయణ కోరారు. ఆయన ఆదివారం చిలకాం గ్రామంలో విలేకర్లతో మాట్లాడారు. ఈనెల 13న మండలంలోని ఉల్లిభద్ర ప్రాంతంలో లోకేష్ శంఖారావాన్ని పూరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ డి.గౌరమ్మ, పార్టీ నాయకులు బొంగు నారాయణస్వామి, కండేన బలరాంనాయుడు, అక్కేన నారాయణరావు ఉన్నారు. ● **గుమ్మలక్ష్మీపురం:** ఈనెల 13న కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం ఎర్రన్నగుడి వద్ద జరగనున్న లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని టీడీపీ అరకు అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ లోకేష్ సభకు పెద్దఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు హాజరుకావాలని కోరారు. ● **పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:** పార్వతీపురం నియోజకవర్గంలో ఈనెల 14న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర కోరారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. శంఖారావం కార్యక్రమానికి పార్వతీపురం పట్టణంతో పాటు పార్వతీపురం, సీతానగరం, బలిజిపేట మండలాల నుంచి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. టీడీపీ నాయకులు బోనుదేవి చంద్రమౌళి, బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, కోలా మధు, బేత లక్ష్మణరావు, కొత్త శ్రీనివాసరావు, కౌన్సిలర్ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ● **పాలకొండ:** లోకేష్ ఈనెల 13న పాలకొండ నియోజకవర్గంలో చేపట్టనున్న శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు సామంతుల దామోదరరావు, వారాడ సుమంత్‌నాయుడు, పడాల భూదేవి కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక సీఎల్‌నాయుడు కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. టీడీపీ నాయకులు ఖండాపు వెంకటరమణ, బిడ్డిక దమయంతినాయుడు, హిమరిక ప్రసాద్, గుమ్మడి సింహాద్రి, సవర మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోలతో ప్రచారం

వీరఘట్టం: ఈనెల 13న పాలకొండలో జరగనున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ శంఖారావం సభను విజయవంతం చేయాలని వీరఘట్టం మండల టీడీపీ అధ్యక్షుడు ఉదయాన ఉదయభాస్కర్, జామి లక్ష్మీనారాయణ కోరారు. ఈ మేరకు ఆటోతో గ్రామ గ్రామాన ప్రచారం చేస్తూ పెద్దఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చేలా ఏర్పాటు చేస్తున్నారు.

16న గజపతినగరం నియోజకవర్గంలో..

గజపతినగరం: నియోజకవర్గం పరిధిలోని గంట్యాడ మండలంలోగల స్థానిక బీఈడీ కళాశాలలో ఈనెల 16న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తలపెట్టిన శంఖారావం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు కోరారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి బూత్ కమిటీలు, మహిళా సాధికార కార్యకర్తలతో పాటు నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయవంతంగా గెలుపొందే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకు రావాలని కోరారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు అడ్డుకట్టవేసే విధంగా గ్రామాల్లో వైసీపీ నాయకులను నిలదీయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎ.లక్ష్మునాయుడు, రాష్ట్ర నాయకులు పీవీవీ గోపాలరాజు, ప్రదీప్‌కుమార్, మిత్తిరెడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే..

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: రాష్ట్రంలో మరో రెండు నెలల్లో వైసీపీ ప్రభుత్వం ఇంటికి వెళ్లిపోతుందని, వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమని టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కె.శ్రావణ్ అన్నారు. ఆదివారం రాత్రి పార్వతీపురం వచ్చిన సందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 13న పాలకొండ, కురుపాం నియోజకవ ర్గాల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఎన్నికల శంఖారావాన్ని ప్రారంభిస్తారన్నారు. ఈనెల 14న పార్వతీపురం, సాలూరులో శంఖారావం సమావేశాలు జరుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయచంద్ర, పార్టీ నాయకులు బార్నాల సీతారాం, కోరాడ నారాయణరావు, కోలా మధు, బోనుదేవి చంద్రమౌళి, సత్యనారాయణ ఉన్నారు.


గరుగుబిల్లి: మాట్లాడుతున్న సత్యనారాయణ


పాలకొండ: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గ్రావెల్ అక్రమ రవాణా

- ఉంగరాడమెట్ట కేంద్రంగా దోపిడీ


ఉంగరాడమెట్ట నుంచి ట్రాక్టర్‌తో అడ్డదారిలో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

రేగిడి: గుళ్లపాడు రెవెన్యూ పరిధిలో ఉంగరాడమెట్ట సర్వే నెంబరు 1, 5లో నిషేధిత కొండభూమిగా ఉండగా... ఈ కొండను అక్రమార్కులు తవ్వేస్తున్నారు. ఇటీవల కాలంలో ఇక్కడి నుంచి గ్రావెల్ అక్రమంగా తరలిపోతోంది. ఇక్కడ కొండ భూమి హౌస్‌సైట్‌ల వివాదాల నేపథ్యంలో నిషేధం ఉన్నా కొంతమంది ఈ దందాకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రోజుకు పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఉంగరాడమెట్ట నుంచి అడ్డదారిలో పాలకొండ, రాజాం వైపు తరలిస్తున్నారు. దీనిపై రెవెన్యూ, మైన్స్‌శాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై గుళ్లపాడు పంచాయతీకి చెందిన వండానిపేట గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోతోందని వాపోతున్నారు. గుళ్లపాడు వీఆర్వో సన్నందొరను వివరణ కోరగా అక్రమ కంకర తవ్వకం విషయం తన దృష్టికి రాలేదని అన్నారు. దీనిపై తహసీల్దార్‌కు నివేదిస్తానని చెప్పారు.

ఓవర్‌లోడ్ ప్రయాణాలు ఉపేక్షించేది లేదు


వాహనాల తనిఖీ నిర్వహిస్తున్న దృశ్యం

రేగిడి: నిబంధనలు ఉల్లంఘించి ఓవర్‌లోడ్ వాహనాలపై అపరాధ రుసుం విధిస్తామని ఎస్ఐ శ్రీనివాస్ వాహనదారులను హెచ్చరించారు. ఉంగరాడమెట్ట కూడలిలో ఆదివారం స్థానిక ఎస్ఐ శ్రీనివాస్ వాహనాల తనిఖీ నిర్వహించారు. పరిమితికి మించి వెళ్తున్న ఆటోను సీజ్‌చేసి కేసు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మరో 15మంది ద్విచక్ర వాహనదారుల నుంచి రూ.3,800 అపరాధ రుసుం విధించినట్టు ఎస్ఐ తెలిపారు. ఈసందర్భంగా రహదారి భద్రత, ఓవర్‌లోడ్ ప్రయాణాలపై చైతన్యం కల్పించారు.

పూర్వ విద్యార్థుల కలయిక

జామి: అలమండ ఉన్నత పాఠశాలలో 2000వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాల వద్ద కలుసుకున్నారు. ఈసందర్భంగా గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన 12మంది ఉపాధ్యాయులను సత్కరించారు.


ఆ నాటి గురువులతో పూర్వవిద్యార్థులు

రేపు రవాణా రంగ సమస్యలపై సమావేశం

విజయనగరం దాసన్నపేట: రవాణా రంగ సమస్యలపై ఈనెల 13న కేఎల్ పురంలోని సీఐటీయూ భవనంలో ఉదయం 10.30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌పోర్టు యాజమానులు, డ్రైవర్లు హాజరు కావాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫేడరేషన్ జిల్లా కన్వీనరు ఎ.జగన్మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి వి.రాములు కోరారు. ఈ మేరకు ఆదివారం ట్రాన్స్‌పోర్టు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. అలాగే ఈనెల 16న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేసేందుకు రౌండ్ టేబిల్ సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ అన్యాయం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వేంకటేశ్వరరావు


ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

బొబ్బిలి: రాష్ట్రంలో వైసీపీ, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాల హయాంలో అన్ని వర్గాల ప్రజలకు కడగండ్లు మిగిలాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వై.వేంకటేశ్వరరావు దుయ్యబట్టారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడా రు. బీజేపీ, వైసీపీ పాలనలో నిత్యావసర సరుకులు, పెట్రోలు, విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగిపోవడంతో సామాన్యుల జీవనం దుర్భరమైందన్నారు. ప్రజా ఉద్యమాల్లో కీలకమైన పాత్ర పోషిస్తున్న సీపీఎంకు విరాళాలు సమకూర్చాలని ఆయన కోరారు. బొబ్బిలి పట్టణంలో ఆయన నాయకత్వంలో సీపీఎం నాయకులు ఆదివారం ఇంటింటికీ వెళ్లి విరాళాలను సేకరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, స్థానిక నాయకులు పి.శంకరరావు, ఎస్.గోపాలం, బలస శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా..

లోకేష్‌ను కలిసిన రవిశేఖర్

నెల్లిమర్ల: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను పార్టీ ఇచ్ఛాపురం నియోజకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వచ్చిన లోకేష్‌ను ఆయన నేరుగా కలిసి, నియోజకవర్గంలో పార్టీ పరిస్థితులపై మాట్లాడారు. విజయనగరం జిల్లాలో పార్టీ కార్యక్రమాలపై ఆయన రవిశేఖర్‌తో చర్చించారు.

బొండపల్లి తహసీల్దార్‌గా హనుమంతురావు

బొండపల్లి: బొండపల్లి తహసీల్దార్‌గా ఎస్.హనుమంతురావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. విజయ నగరం రెవెన్యూ డివిజనల్ కార్యాలయలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న హనుమంతురావు బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈసందర్భంగా ఆయనకు రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు శుభాకాంక్షలు తెలిపారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

సాలూరు రూరల్: సాలూరు పట్టణంలో అక్రమంగా విక్రయానికి తీసుకొచ్చిన సారా ప్యాకెట్లతో ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ సీతారామారావు ఆదివారం తెలిపారు. సాలూరుకు చెందిన పతేడ సంతోష్ అనే వ్యక్తి పట్టణంలో అక్రమంగా విక్రయించేందుకు 1,300 సారా ప్యాకెట్లు తీసుకొస్తుండగా, తనిఖీల్లో పట్టుకున్నామని చెప్పారు. ఈ మేరకు సారా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్టు చేశామని ఆయన తెలిపారు.

రోడ్డు విస్తరణకు భూమి పూజ

పాచిపెంట: పి.కోనవలస చెక్‌పోస్టు నుంచి పాచిపెంట ఆర్టీసీ కాంప్లెక్స్ వరకుగల తొమ్మిది కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు స్థానిక ఎంపీపీ బర్నాన ప్రమీల ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ విస్తరణ పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. స్థానిక దళిత కాలనీ నుంచి పాతబస్టాండ్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకుగల సుమారు రెండు కిలో మీటర్లు బైపాస్ రోడ్డు ఇరువైపులగల నివాస గృహాలు తొలగించక తప్పదన్నారు.

మార్నింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా పీఎస్ఎన్

బెలగాం: మార్నింగ్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడిగా పోలా సత్యనారాయణ (పీఎస్ఎన్) ఎన్నికయ్యారు. ఆదివారం పార్వతీపురం పట్టణలోని జూనియర్ కళాశాల మైదానంలో మార్నింగ్ వాకర్స్ క్లబ్ సభ్యుల ఎన్నిక జరిగింది. సత్యనారాయణను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు.

ఘంటసాలకు నివాళి

గరివిడి: స్థానిక సహాయ్ పార్క్‌లో ఆదివారం ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి వేడుకలు సహాయ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సహాయ్ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాసరావు, ప్రతినిధులు పాల్గొన్నారు. సంగీత కళాకారులు విష్ణుభట్ల వెంకటరామయ్య, కళ్యాణం రాము తదితరులకు సత్కరించారు. ● **సాలూరు రూరల్:** ఘంటసాల వేంకటేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం సాలూరులోని ఆయన విగ్రహం వద్ద కబీర్‌షా అండ్ పార్టీ ఆర్కెస్ట్రా నిర్వాహకులు నివాళులర్పించారు. విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించారు. షేక్ బాషా, సారిపాక రామప్రసాద్, జరజాపు సూర్యనారాయణ, షావుకారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.




గరివిడి, సాలూరు రూరల్: ఘంటసాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

నెల్లిమర్ల: ఈనెల 16న చేపట్టనున్న గ్రామీణ భారత్ బంద్‌ను జయ ప్రదం చేయాల ని ప్రజా సం ఘాల నాయకులు పిలుపుని చ్చారు. ఈ మేరకు ఆదివారం స్థానిక అమర కార్మిక భవనంలో కరపత్రాలు విడుదల చేశారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ నాయ కులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి, కనకల పద్మనాభం పాల్గొన్నారు. కేంద్ర విధానాలపై విమర్శలు చేశారు.

వైభవంగా చండీ యాగం


యాగం నిర్వహిస్తున్న దృశ్యం

గరివిడి: స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం చండీ సప్తశతి యాగం వైభవంగా నిర్వహించారు. వాసవి మాత ఆత్మార్పణ దినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నగర సంకీర్తన, సుప్రభా త సేవ, రాత్రి పవళింపుసేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పైపులైను లీకేజీ

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో మున్సిపల్ తాగునీటి పైపులైన్ల లీకేజీలు నిత్యకృత్యమయ్యాయి. పట్టణంలో ఎక్కడపడితే అక్కడ పైపులైన్లు లీకేజీ అవడంతో పెద్దఎత్తున తాగునీరు వృథాగా పోతోంది. తాజాగా బలిజిపేట రోడ్డులో సాయిగణపతి థియేటర్ సమీపంలో పైపులైను నుంచి నీరు లీకై భారీగా మురికి కాలువల్లోనికి పోతోంది. నడిరోడ్డుపై ఈ లీకేజీ సమస్యతో వాహనదారులకు, బాటసారులకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. స్థానిక నాయుడు కాలనీలో డాక్టర్ గోపీనాథ్ హాస్పటల్ వెనుక రోడ్డులో చాలా కాలంగా మున్సిపల్ పైపులైను లీకై నీరంతా కాలువలోకి పోతోంది. తక్షణం ఈ లీకేజీలను అరికట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


బొబ్బిలి పట్టణంలో పైపులైను లీకవుతున్న దృశ్యం